రాగం :　　　　తాళం :　　　　గానం :

రచన : డా॥ డి. కామేశ్వర రావు　　　　సంగీతం : శ్రీ కె. రామాచారి

# 182. గున్నమావి

ప ॥ గున్నమావి కొమ్మమీద కూసింది కోయిలమ్మా
సన్నజాజి గుండెలోని రాగాలు పాడెనమ్మా
పులకించి చిగురులే పలికె కబురులే
అదిచూసి విరులతో కులికె గుబురులే
జగమే మెరిసే కొమ్మల్లో చైత్రాల
రంగుల్లో చిత్రాలు చిందేయిగా.... ॥ గున్నమావి ॥

చ ॥1 రేయిలోని తారలన్నీ వేకువింట ముగ్గులల్లీ సొగసే పరిచే వెలుగులతో....
రాయలేని పాటలన్నీ పాడుకున్న తీగమల్లీ విరిసీ ఎగసే వలపులతో....
ఝుమ్మను తుమ్మెద పల్లవి పాటలు పువ్వుల నవ్వే కదా....
కమ్మని తెమ్మెర నెమ్మది నెమ్మది గుండెను దోచేయదా...
చిరుగాలే తగిలితే కదిలె వెదురులే
మురిపాలే స్వరములై కథలు పలుకులే...
కలయో నిజమో ఎన్నెన్నో స్వర్గాలు ముంగిట్లో ఉన్నట్లు ఉన్నానులే ... ॥ గున్నమావి ॥

చ ॥2 సందెలోని మబ్బులన్నీ సిగ్గుపడ్డ బుగ్గగిల్లీ ఎరుపై విరుపై మెరిసేలే ...
కొత్త కొత్త ఊహలన్నీ కొండచాటు వాగులల్లే అలలై కలలై ఎగసేలే...
చల్లని వెన్నెల వన్నెల కన్నుల కిన్నెర మీటేనులే...
అల్లరి ఆశల గువ్వల రెక్కలు ఎల్లలు దాటేనులే...
హృదయాలే తడిమితే వయసు పరిమళం ...
ప్రణయాలే తెలుపవా బ్రతుకు పరవశం....
అరెరే అరెరే పువ్వంత కవ్వింత తుళ్ళింత ఒళ్ళంత అల్లేనులే... ॥ గున్నమావి ॥